నిధులు ఫుల్.. పనులు నిల్

- రూ.80లక్షలతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- నిలిచిన రహదారి పనులు
- పూర్తి చేయాలని ప్రజల డిమాండ్

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామం నుంచి మున్నేరు వాగు లిఫ్ట్ ఇరిగేషన్ వరకు నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్ష మెప్పుడని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2023–2024 ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.80లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023 అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ తండా నుంచి ఎత్తిపోతల పథకం వరకు రోడ్డు వెడల్పు చేసి ఫార్మేషన్ కోసం మట్టిని పోయడం జరిగింది. పనులు జరుగుతున్న సమయంలోనే భారీ వర్షాలు రావడంతో మట్టి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో పోసిన మట్టి వృథా అయిపోయింది. ఫార్మేషన్ కోసం రోడ్డును వెడల్పు కోసం తవ్విన మట్టి పూర్తిగా పోవడంతో ఫార్మేషన్ కాలేదు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు పనులు నిలిచిపోయాయి. తండా నుంచి లిఫ్ట్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి అయితే తండాకు చెందిన రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తండా ప్రజలు కోరుతున్నారు.


తండా నుంచి లిఫ్ట్ వరకు పనులు చేపట్టాల్సిన రోడ్డు..


శంకుస్థాపన చేసిన శిలాఫలకం

20శాతం పనులు కూడా పూర్తి కాలేదు



బంచరాయి తండా నుంచి లిఫ్ట్ వరకు మంజూరైన నిధులతో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. 20శాతం పనులు కూడా పూర్తి కాలేదు. అధికారులు చొరవ తీసుకుని రోడ్డు పనులు చేయించాలి. రైతులు, కూలీలు పంటచేలు, లిఫ్ట్ వరకు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వెంటనే పనులు మొదలు పెట్టాలి.

– బానోత్ దేవేందర్, తండావాసి

వేసవి కాలంలోనే పూర్తి చేయాలి



వేసవి కాలంలోనే లిఫ్ట్ రోడ్డు పనులు పూర్తి చేస్తే రైతులకు, కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వర్షాలతో పనులు జరిగే అవకాశం లేదు. కాంట్రాక్టర్ చొరవ తీసుకుని పనులు మొదలు పెట్టాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు జరిగేలా చూడాలి.

– మాలోత్ సుధాకర్, తండావాసి

మిర్చి రైతులను అప్పులపాలు చేయొద్దు

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరయ్య

మరిపెడ: మిర్చి ధర పూర్తిగా తగ్గించి రైతులను అప్పుల పాలు చేయవద్దని, వారికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్వాల వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశం కందాల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. ఆరుగాలం అన్నదాతలు కష్టపడి పండించిన మిర్చి ధర దారుణంగా పడిపోయిందన్నారు. గతంలో నల్లి తెగులు సోకి నష్టం వాటిల్లగా, ప్రస్తుతం ధర రూ.12వేలకు చేసి మిర్చి రైతులను మోసం చేసే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. విపరీతంగా పెట్టుబడులు పెరిగిన తరుణంలో మిర్చి ధరను తగ్గించి రైతాంగాన్ని కోలుకోకుండా చేయడం హేయమైన చర్య అని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రూ.25వేలు మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు బాణాల రాజన్న, కందాల రమేశ్, మండల కార్యదర్శి బోడపట్ల రాజశేఖర్, దొంతు మమత, కొండ ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అల్వాల వీరయ్య

నీలికుర్తి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మరిపెడ రూరల్: మరిపెడ మండలం నీలికుర్తి ఫీల్డ్ అసిస్టెంట్ ఉప్పలయ్యను ఉపాధి హామీ విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్లు మరిపెడ ఎంపీడీఓ విజయ శనివారం తెలిపారు. ఇటీవల గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీల్లో నిధులు దుర్వినియోగం, మస్టర్లలో ఫోర్జరీ సంతకాలు, బంధువులతోపాటు హైదరాబాద్‌లో ఉన్న వారి అకౌంట్‌లో ఉపాధి హామీ కూలీ డబ్బులు వేయడం లాంటి తదితర అవినీతికి సంబంధించిన పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. అదేవిధంగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు వెల్లడి కావడంతో మండల ప్రజావేదికలో రూ.1.21లక్షలు సదరు ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీఆర్డీఓ ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

క్లుప్తంగా

ముగిసిన చింతలగట్టు జాతర

గూడూరు: మండలంలోని దామరవంచ, జగన్నాయకులగూడెం సమీప జాతీయ రహదారి పక్కన దట్టమైన అడవిలో చింతలగట్టు వట్టి వాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర శనివారంతో ముగిసింది. మూడు రోజులుగా జాతర ప్రదేశం జన సమూహంతో వడ్డెల పూనకాలు, డోలు చప్పుళ్లతో మార్మోగగా చివరి రోజు భక్త సందోహం తగ్గి గద్దెలు ఖాళీగా కనిపించాయి. సాయంత్రం 5గంటలకు జాతర కమిటీ నిర్వాహకులు, పూజారులు ముగింపు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి దారం సిద్ధు, కారం లక్ష్మయ్య, తాటి సుధాకర్, దారం నరేష్, వాసం రమేశ్, జాతర కమిటీ ప్రతినిధులు పెనక నాగయ్య, ఈసం సహదేవులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

గూడూరు: ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ సాంస్కృతిక సేనా జిల్లా అధ్యక్షురాలు కోరం భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మట్టెవాడలో శుక్రవారం రాత్రి తెలంగాణ సాంస్కృతిక సేనా జిల్లా విభాగం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పథకాలపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భాగ్యలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేగ వెంకటేశ్వర్లు, నాయకులు వాసం వీరస్వామి, గుగ్గిళ్ల నరసింహా, ఈసం రమేశ్, పెనక అశోక్, వాసం సమ్మయ్య, బిక్కి ఉపేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

డోర్నకల్: డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. ఏఈ జగదీష్ ఆధ్వర్యంలో 1, 14, 15 వార్డుల్లో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఇంటి స్థలాలు, ఇళ్లను పరిశీలించారు.

నోట్ బుక్స్ పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాలర్ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ పేద గిరిజన విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్ రిజ్వానా, బానోతు వెంకన్న నాయక్, లింగాల సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కొత్తగూడ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ నీలోఫర్ అజ్మీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ అభ్యాసన స్థాయిలను పరీక్షించారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న గుడ్లు, ఇతర పౌష్టికాహార వివరాలు తెలుసుకున్నారు. ప్రమోకాళ్లపల్లిలో నిర్మాణంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రామలక్ష్మి ఉన్నారు.

పరీక్ష ప్యాడ్ల వితరణ

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన యాసిన్ మాలిక్ ఖురేషి శనివారం పుట్టినరోజును పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశాడు. పది వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ. 3116లు, రెండో ర్యాంక్ విద్యార్థికి రూ. 2116లు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తానని ఖురేషి తెలిపాడు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

గూడూరు: గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యతోపాటు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయుడు పులి దేవేందర్ అన్నారు. మండలంలోని సీతానగరం పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో కవిత, రజిత, పద్మ, వీరమ్మ, లక్ష్మయ్య, మహేందర్, సదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కమిటీ ఎన్నిక

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో విద్యాభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మదూరి వీరభద్రం, కోకన్వీనర్‌గా కొండబత్తుల ఈశ్వర్, సభ్యులుగా బ్రహ్మాచారి, నర్సయ్య, ఇరుగు వెంకన్న, కొత్త వెంకటేశ్వర్లు, జక్కుల సందీప్, కొలిపాక ఆంజనేయులు, కప్పల వెంకటేశ్వర్లు, షేక్ యాకూబ్‌లను ఎన్నుకున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక బీజేపీ

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమందర్ రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో శనివారం నిర్వహించిన ఎన్నికల సమావేశానికి ప్రేమేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా ఉద్యమకారుడు మేధావి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు కరువయ్యారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే బీజేపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ సుందర్ శర్మ, నాయకులు చీకటి మహేష్ గౌడ్, చెల్పూరు వెంకన్న, ధర్మారపు వెంకన్న పార్లమెంటు కోకన్వీనర్ సింగారపు సతీష్, మేరెడ్డి సురేందర్, గద్దం అశోక్, దేవిక నాయక్, పెంటయ్య, పూర్ణచందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

పోరాట యోధుడు ధర్మభిక్షం

నెహ్రూసెంటర్/కురవి/నెల్లికుదురు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మిక, కర్షకుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేసిన నల్లగొండ పార్లమెంట్ మాజీ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ధర్మభిక్షం జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. గీత పనివారల సంఘాన్ని స్థాపించి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారని, గీత కార్మికుల సంక్షేమానికి రూ. 5వేల కోట్లు కేటాయించాలని, తాటి, ఈత వనాల పెంపకానికి సొసైటీకి పది ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు రామ్మూర్తిగౌడ్,చిర్ర వెంకటేశ్వర్లుగౌడ్, తండ సతీష్‌గౌడ్, సందీప్‌గౌడ్, నాగార్జున పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

జిల్లాస్థాయి క్రికెట్ విజేత సీతంపేట


గెలుపొందిన జట్టుకు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో సీతంపేట జట్టు క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఫైనల్లో కప్ గెలుచుకుంది. సీతంపేట గ్రామంలో శనివారం మర్రిగూడెం, సీతంపేట జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలో సీతంపేట జట్టు ప్రథమస్థానంలో నిలిచి కప్‌ను కైవసం చేసుకుంది. దాతలు ఊరుగొండ శ్రీనివాస్, భూక్యా భద్రుస్వామి, మాలోత్ హనుమంతు, భూక్యా నరేష్‌ల చేతుల మీదుగా కప్ అందజేశారు. కార్యక్రమంలో గుండా వెంకట్‌రెడ్డి, శివనాయక్, హతిరాం, శంషాద్‌బేగం, వెంకట్‌లాల్, నిర్వాహకులు భూక్యా సర్వేష్, మాలోత్ భాస్కర్ పాల్గొన్నారు.

నేటినుంచి లింగమంతుల జాతర

బయ్యారం: రెండు సంవత్సరాలకోసారి మండలంలోని జగ్గతండా శివారులో నిర్వహించే పెద్దగట్టు లింమంతులస్వామి జాతర ఆదివారం గంపల ఊరేగింపుతో ప్రారంభం కానుంది. బయ్యారంలో ప్రారంభమయ్యే గంపల ఊరేగింపు బయ్యారం, జగ్గతండా పురవీధుల గుండా కొనసాగి అర్ధరాత్రి ఆలయం వద్దకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా యాదవులు గజ్జెలలాగుతో లయబద్ధంగా నృత్యాలు చేయడం పలువురిని ఆకట్టుకుంటుంది. సోమవారం ఆలయం వద్ద బోనాలు, మొక్కులు చెల్లిస్తారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వద్ద పలు ఏర్పాట్లు చేశారు. రంగుల లైట్లతో ఆలయం శోభాయమానంగా మారింది. లింగమంతుల జాతరకు రావాల్సిందిగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఆహ్వానపత్రం అందజేశారు.

జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల విజ్ఞానయాత్ర


కిన్నెరసాని రిజర్వాయర్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

డోర్నకల్: వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు శనివారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్, పాల్వంచ సమీపంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌ను సందర్శించారు. కిన్నెరసాని నీటి వివరాలు తెలుసుకుని రిజర్వాయర్‌లో బోటింగ్ చేశారు. హెచ్‌ఎం బండి నర్సింహారావు ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర జరిగింది.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శనివారం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూజలు చేశారు. భోగ్ భండారో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సేవాలాల్ తన బంజార జాతి కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్: భోగ్ భండారో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు


చిన్నగూడూరు: పూజ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులు


గార్ల: నృత్యాలు చేస్తున్న బంజారాలు


తొర్రూరులోని దుబ్బతండాలో పూజలు చేస్తున్న గిరిజన నాయకులు


కురవి: లింగ్యా తండాలో..


బయ్యారం: వేడుకల్లో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, తదితరులు


మహబూబాబాద్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు


మరిపెడ: వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు


మహబూబాబాద్ రూరల్: ఆలయానికి వెళ్తున్న నాయకులు


మరిపెడ రూరల్: వాల్యతండాలో..


దోర్నకల్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు

క్రైం కార్నర్..

భవనం పైనుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

ఖమ్మం అర్బన్: ఖమ్మం వెలుగుమట్ల గుట్ట సమీపాన నిర్మాణంలో ఉన్న ఒక ప్రైవేట్ కాలేజీ భవనం పైనుండి పడడంతో సెంట్రింగ్ కార్మికుడు చిర్రా వీరన్న(40) మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ములకలపల్లికి చెందిన వీరన్న కొంతకాలంగా ఖమ్మంలోని యూపీహెచ్ కాలనీలో అద్దెకు ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. రోజులాగే శనివారం వెళ్లిన వీరన్న ఐదో అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. కాగా, వీరన్నకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. నలుగురికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారు చంద్రు తండా వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. చంద్రు తండాకు చెందిన మాలోతు రాందాస్, భద్రమ్మ దంపతులను వారి కుమారుడు నరేష్ గ్రామ శివారులో గల మిర్చి కల్లం వద్ద వదిలిపెట్టడం కోసమని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నాడు. బయ్యారం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన జాల రమేష్ తన ద్విచక్ర వాహనంపై నడివాడ గ్రామం వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు కూడా చంద్రు తండా సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాందాస్, భద్రమ్మ, నరేష్, రమేష్ నలుగురికి తీవ్రగాయాలుకాగా వెంటనే వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి రిమాండ్

తొర్రూరు: గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన కేసులో బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ ఆర్.ప్రవీణ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. తొర్రూరు పట్టణానికి చెందిన బొమ్మన బోయిన వెంకన్న సారా విక్రయిస్తూ పట్టుబడగా ఎక్సైజ్ సిబ్బంది స్థానిక తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ అదే తరహాలో గుడుంబా విక్రయాలు కొనసాగిస్తుండడాన్ని బైండోవర్ ఉల్లంఘనగా పరిగణించిన ఎక్సైజ్ పోలీసులు అతన్ని ఖమ్మం జైలుకు తరలించారు. తొర్రూరు పట్టణ శివారులోని దుబ్బతండాకు చెందిన ధరావత్ యాకూబ్, పెద్ద వంగర మండలం వంపుతండాకు చెందిన ధరావత్ శ్రీనులు సైతం బైండోవర్ ఉల్లంఘించడంతో వారికి రూ.90వేల జరిమానా విధించారు. గుడుంబాను పూర్తిగా నిర్మూలించేందుకు తొర్రూరు డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై రవళిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏను ప్రామాణికంగా తీసుకోవద్దు

మహబూబాబాద్ అర్బన్: డీఎస్సీ 2008 ఉపాధ్యాయుల నియామకంలో హెచ్‌ఆర్‌ఏను ప్రామాణికంగా తీసుకోవద్దని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేశ్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయ అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైస శ్రీనివాసులు, పాపావత్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గంగాధరి అనిల్ మండలంలోని కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను శనివారం వితరణ చేశాడు. తనకు క్రీడలంటే ఇష్టమని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పంపిణీ చేసినట్లు అనిల్ తెలిపాడు. క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ అనిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.